

బ్రహ్మాండంగా 'భాగ్ సవారీ'

తిరుమలలో బుధవారం అనంతాళ్వార్‌తోటలో బ్రహ్మాండంగా భాగ్ సవారీ ఉత్సవం నిర్వహించారు.

- 8లో



పర్యావరణ హితంగా పర్యాటకం

పర్యావరణ హితంగా పర్యాటక రంగం అభివృద్ధికి కృషి చేయాలని మేయర్ శిరీష పిలుపునిచ్చారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	25
చిత్తూరు	33	24
తిరుమల	29	21
గూడూరు	36	26
నగరి	34	25

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులతో ప్రిన్సిపల్ మీరా సాహెబ్

చిల్లకూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిల్లకూరు గురుకుల పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. బాల్ బ్యాడ్మింటన్, టెన్ని కాయిట్, చెస్, హ్యాండ్‌బాల్ పోటీలకు సుమారు 200 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీరేష్ వెల్లడించారు. విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మీరా సాహెబ్ పాల్గొన్నారు.

పవిత్రాలు.. ప్రత్యేక పూజలు



పవిత్రాలు తీసుకువస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, అర్చకులు

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారు, పరివార దేవతలకు బుధవారం పవిత్రాలు అలంకరించారు. ఈ సందర్భంగా యాగశాల వద్ద అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ స్వామినాథన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పవిత్రాలను ప్రధాన ఆర్చకులు సంబంధం గురుకుల్, కరుణా గురుకుల్ ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకువచ్చారు.భరద్వాజ మహర్షి, శ్రీ-కాళ-హస్తి, ప్రధాన దేవతా మూర్తులకు అలకరించి ధూప,దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, డిప్యూటీ ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి వివరాల నమోదు

తిరుపతి ఎడ్యుకేషన్ : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులు ఉపకార వేతనం పొందేందుకు అక్టోబరు 1నుంచి నవంబరు 30వ తేదీలోపు తమ వివరాలను నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని డీఈఓ శేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మెరిట్ కార్డులో ముద్రించిన విధంగానే అక్షరం పొల్లుపోకుండా పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. పాఠశాల నోడల్ అధికారి పరిశీలించి డిసెంబర్ 15వ తేదీలోపు నోడల్ ఆఫీసర్ లాగిన్ ద్వారా పరిశీలించాలన్నారు. పోర్టల్ అప్లికేషన్, వివరాలను డిసెంబరు 30వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో జిల్లా నోడల్ అధికారి వద్ద ధ్రువీకరించుకోవాలని కోరారు. అలాగే 2019, 2021, 2022లో ఎంపికైన విద్యార్థులు సైతం తప్పనిసరిగా ఈ ఏడాదికి రెన్యూవల్ చేసుకోవాలని, లేకుంటే స్కాలర్‌షిప్ మంజూరు కాదని వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 4 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 55,747 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,774 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 4.11 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

వైభవంగా పవిత్రాల సమర్పణ



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవర్లను తిరుచ్చిపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ అలంకార మండపంలో నవ కలశ స్థాపన, చతుస్థానార్చన , మహా సుదర్శన హోమం, లఘు పూర్ణాహుతి, వేద, దివ్య, ప్రబంధ పారాయణాలు చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో పవిత్రాలను సమర్పించారు. కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాణిపాకం పుణ్యక్షేత్రం బుధవారం ఎటు చూసినా ఆధ్యాత్మకను సంతరించుకుంది. స్వయంభు శ్రీవినాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల చివరి రోజు పలు సేవలు ఆద్యంతం శోభను సంతరించుకున్నాయి. ఉదయం త్రిశూల స్నానం సందర్భంగా భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి తన్మయులయ్యారు. అనంతరం వసంతోత్సవం, సాయంత్రం ధ్వజావరోహణం, యాగశాలలో ముగింపు పూజలు, రాత్రి వడాయత్తు ఉత్సవం, ఏకాంత సేవ కార్యక్రమాలు నయనానందకరంగా జరిగాయి.



పుష్కరిణిలో త్రిశూలానికి పవిత్ర స్నానం



ధ్వజావరోహణ పూజలు చేస్తున్న అర్చకులు

త్రిశూల స్నానం.. పులకించిన భక్తజనం

- ధ్వజావరోహణతో ముగిసిన బ్రహ్మోత్సవాలు
- శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం
- వేడుకగా వసంతోత్సవం, ఏకాంతసేవ

కాణిపాకం(యాదమరి): స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ నవరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజావరోహణంతో వైభవంగా పరిసమాప్తమయ్యాయి. ఉదయం ఆలయ పుష్కరిణిలో త్రిశూలానికి శాస్త్రోక్తంగా పవిత్ర స్నానం చేయించారు. తొలుత మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీసిద్ధి, బుద్ధి, సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను, త్రిశూలాన్ని పురవీధుల్లో ఊరేగించి, పుష్కరిణివద్దకు వేంచేపు చేశారు. యాగశాలలో ఏర్పాటు చేసిన 108 కలశాలలోని తీర్థాలను పుష్కరిణిలో కలిపారు. అనంతరం త్రిశూలానికి పవిత్ర స్నానం చేయించారు. ఈ సందర్భంగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు రంగు నీళ్ల చల్లుకుంటు కోలాహలంగా ఊరేగించారు. తదుపరి యాగశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పర్యవేక్షణ యాగ మూర్తికి ముగింపు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో ప్రధాన సూత్రధారులుగా చేస్తూ ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశుకు కట్టిన రక్ష బంధనాలను అర్చకులు శాస్త్రోక్తంగా తొలగించారు. సాయంత్రం ధ్వజావరోహణంలో భాగంగా ఆలయంలోని స్వర్ణ ధ్వజస్తంభానికి అభిషేక పూజలు నిర్వహించారు. దీపధూప నైవేద్యాలు సమర్పించారు. ధ్వజస్తంభంపై నుంచి మూషక చిత్రపటాన్ని శాస్త్రోక్తంగా అవరోహణ చేశారు.



బుధవారం రాత్రి ఏకాంత సేవలో స్వామివారికి హారతి



పూజల్లో పాల్గొన్న ఆలయ అధికారులు, భక్తులు

నేత్రానందంగా వడాయత్తు ఉత్సవం

రాత్రి స్వామివారికి వడాయత్తు ఉత్సవాన్ని నేత్రానందంగా నిర్వహించారు. స్వామి వారి మూలవిగ్రహానికి అభిషేకం నిర్వహించి, పెసర పప్పు పాయసం, ఉద్ది వడలు నైవేద్యంగా సమర్పించి వడాయత్తు ఉత్సవాన్ని అత్యంత వైభవంగా చేపట్టారు. ఈసేవ స్వామి వారికి అత్యంత ప్రీతి పాత్రమైందని పురాణాలు చెబుతున్నాయి. అనంతరం స్వామివారికి ఏకాంతసేవను నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణలు చేశా రు. పాలు పండ్లు నైవేద్యంగా సమర్పించి మంగళ హారతులు ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో అల సిన స్వామివారికి ఏకాంత సేవను భక్తి ప్రపత్తుల తో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓలు, సూపరింటెండెంట్లు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



వసంతోత్సవంలో ఆలయ సిబ్బంది, భక్తులు

స్టెమ్ రంగాల్లో బాలికలకు ఉత్తమ కెరీర్



జవహర్ నవోదయ విద్యార్థులతో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు : శాస్త్ర, సాంకేతిక, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) రంగాల్లో బాలికల ఉత్తమ కెరీర్‌కు అవకాశాలున్నట్లు ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ తెలిపారు. బుధవారం విద్యా జ్యోతి పథకంలో భాగంగా చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల జవహర్ నవోదయ విద్యాలయాలకు చెందిన 100 మంది విద్యార్థుల బృందం మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణాన్ని సందర్శించింది. డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు రోల్‌మోడళ్లను పరిచయం చేసి వారికి సాధికారత కల్పించడమే విద్యాజ్యోతి పథకం లక్ష్యమన్నారు. స్టెమ్ రంగాల్లో ఉన్నత విద్య, వృత్తిని అభ్యసించడం, విశ్వాసం, ఉత్సుకతను పెంపొందించడం, ప్రేరేపించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని వివరించారు. ఐఐటీ విద్యా కార్యక్రమాలు, పరిశోధన కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు ఐఐటీలోని వర్క్‌షాపులు, ప్రయోగశాలలను సందర్శించారు. కార్యక్రమంలో ఐఐటీ డీన్ వెంకయ్య పాల్గొన్నారు.

నేడు అనంత పద్మనాభ వ్రతం

తిరుమల : తిరుమలలో గురువారం అనంత పద్మనాభ వ్రతం నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఊరేగింపుగా వరాహస్వామి ఆలయం వద్దకు తీసుకువస్తారు. పుష్కరిణిలో ఆగమోక్తంగా అభిషేకం నిర్వహించి శ్రీవారి ఆలయానికి వేంచేపు చేస్తారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే 'పథకాలు'


తిరుపతి తుడా : మహిళల ఆర్థికాభివృద్ధికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలు చేస్తున్నాయని ఎంపీ గురుమూర్తి తెలిపారు. బుధవారం తిరుపతిలోని పట్టణ జీవనోపాధుల కేంద్రంలో రుణ వితరణ మహోత్సవం నిర్వహించారు. లీడ్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డితో కలిసి లబ్ధిదారులకు చెక్, వాహనాలు పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలనే సదుద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పథకాన్ని మహిళలకే వర్తించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలను మహిళలు, డ్వాక్రా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పర్యాటక రంగం పురోభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అవకాశాలను అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. బ్యాంకర్లు సైతం విరివిగా రుణాలు మంజూరు చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా మంచి యూనిట్లు స్థాపించుకోవడంపై మహిళలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. పభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఫిష్ ఆంధ్ర యూనిట్ల స్థాపనలో జిల్లా ముందంజలో ఉందని తెలిపారు. మహిళలు కోటీశ్వరులుగా ఎదిగేందుకు మేజర్ యూనిట్లను స్థాపించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పీఎం విశ్వ కర్మ యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం చేతి వృత్తులను ప్రోత్సహిస్తోందన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల కింద రుణాలకు సంబంధించి మంజూరు చేసిన రూ.521 కోట్ల చెక్‌ను ఎంపీ, కలెక్టర్ చేతులమీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్ మాట్లాడుతూ ఆర్ ఏం రాం ప్రసాద్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ద్వారా రూ.97 కోట్ల రుణాలు అందించామన్నారు. మేక్ ఇన్ ఇండియా కింద యూనిట్ల స్థాపనకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ గౌరీ శంకర్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ జయకుమార్, బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ యాసిన్ బాషా పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్ అందిస్తున్న ఎంపీ గురుమూర్తి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

దేశంలోనే నంబర్‌వన్‌గా 'స్విమ్స్'

తిరుపతి తుడా : దేశంలోనే నంబర్‌వన్ ఆస్పత్రిగా స్విమ్స్‌ను తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల విద్యార్థులతో మోటివేషన్ టాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ స్విమ్స్ అభివృద్ధికి సకలం సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు టీటీడీ రూ.కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక వైద్య పరికరాలను సమకూరుస్తున్నామని వెల్లడించారు. వైద్య విద్యార్థులు పట్టుదల, నిబద్ధతతో చదువుకోవాలని కోరారు. శ్రీవారి కటాక్షంతోనే టీటీడీ వైద్య కళాశాలల్లో విద్యను అభ్యసించే అవకాశం వచ్చిందనే విషయం గుర్తుంచుకోవాలని తెలిపారు. అత్యుత్తమ వైద్యులుగా ఎదిగేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఎంబీబీఎస్ పూర్తయిన తర్వాత వైద్య పరిశోధనలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కాలం విలువను తెలుసుకుని నిముషం కూడా వృథా చేయకుండా విద్యాభ్యాసం పూర్తి చేసుకోవాలని కోరారు. వైద్య విద్యతోపాటు వేద విజ్ఞానంపై కూడా దృష్టి సారించాలన్నారు. స్విమ్స్, పద్మావతి మెడికల్ కాలేజీని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని స్పష్టం చేశారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ రవికుమార్ మాట్లాడుతూ వైద్య విద్యను శ్రద్ధతో, క్రమశిక్షణతో అభ్యసించాలన్నారు. సేవా భావాన్ని అలవరుచుకోవాలని సూచించారు. డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ బిట్ల , పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా కళావతి, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ముత్తీశ్వరయ్య డాక్టర్ నాగరాజు, డిప్యూటీ డైరెక్టర్ డీవీ దిలీప్, కోబాకు భూపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

బ్రహ్మోత్సవాల్లో ఆర్టీసీ సర్వీసులు భేష్

తిరుపతి అర్బన్ : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో విజయవంతంగా ఆర్టీసీ సర్వీసులు నడిపినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 26వ తేది వరకు 9 రోజుల పాటు ప్రత్యేకంగా 410 ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో బస్సులు అప్ అండ్ డౌన్ 31,836 ట్రిప్పులు తిరిగినట్లు వివరించారు. సుమారు 8,65,574 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించినట్లు తెలిపారు. ఆర్టీసీకి దాదాపు రూ.7కోట్ల రాబడి వచ్చిందని చెప్పారు. ఆర్టీసీలోని అన్ని విభాగాల సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని కోరారు.

వృత్తి విద్యతో ప్రత్యేక గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న అశోకరాజు

నారాయణవనం: వ్యక్తిగత నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుని, ప్రత్యేక గుర్తింపును పొందే అవకాశం వృత్తి విద్యతోనే సాధ్యమని సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు తెలిపారు. బుధవారం సిద్దార్థ ఇంజినీరింగ్ టెక్నాలజీ, సిద్దార్థ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలల్లో ఫస్టియర్ బీటెక్ విద్యార్థులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. అశోకరాజు మాట్లాడుతూ పిల్లలను తమ కళాశాలలో చేర్పిన తల్లిదండ్రుల నమ్మకానికి అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరవ్వాలని సూచించారు. కళాశాలలో కల్పించిన మెరుగైన సాంకేతిక సౌకర్యాలు, అత్యాధునిక ల్యాబ్, లైబ్రరీని వినియోగించుకోవాలని కోరారు. మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందడానికి ఇంక్యుబేషన్ సెంటర్ సైతం అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధనరాజు, రమేష్ , గుణప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల రమేష్



శివకుమార్

తిరుమల : తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. సెంట్రల్ ఫారెస్ట్ సైంటిస్ట్ కె.రమేష్, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు శివకుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీరంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి లడ్డు ప్రసాదాలు అందించారు.

వైన్‌షాపుల్లో అవకతవకలపై కేసు

శ్రీకాళహస్తి : పట్టణంలోని 16 మద్యం దుకాణాల్లో ఈనెల 22వ తేదీన అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐదు దుకాణాల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. బుధవారం ఈ మేరకు ఆయా షాపుల్లోని ఉద్యోగులపై కేసు నమోదు చేశారు. డిపో మేనేజర్ జానకీరామ్ మాట్లాడుతూ రామసేతు వంతెన సమీపంలోని దుకాణంలో మద్యం విక్రయాలకు, ఉండాల్సిన నగదు నిల్వలు మధ్య దాదాపు రూ.6.50 లక్షలు వ్యత్యాసం ఉందన్నారు. మరో 4 మద్యం దుకాణాల్లో సైతం తేడాలు ఉన్నట్లు తేలిందని వివరించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ పృథ్వీ వారిని విచారించగా వారు పొంతన లేని సమాధానాలు ఇచ్చారని, నగదు రికవరీ కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పోలేరమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు



పోలేరమ్మ పూజలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి



జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి తదితరులు

- వైభవోపేతంగా నిర్వహణకు సన్నాహాలు
- పర్యవేక్షిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్ : వెంకటగిరి పోలేరమ్మ జాతరను వైభవోపేతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఈ మేరకు జాతర ఏర్పాట్లను వెంకటగిరి రాజవంశీయులు సాయికృష్ణ యాచేంద్ర, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించారన్నారు. అక్టోబర్ 4, 5వ తేదీల్లో నిర్వహించనున్న జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశముందని, అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో పట్టణంలోని ఎన్‌జేఆర్ భవనంలో పలు శాఖల అధికారులతో నేదురుమల్లి, ఆర్‌డీఓ కిరణ్‌కుమార్ సమీక్షించారు.

కట్టుదిట్టంగా బందోబస్తు

వెంకటగిరి పోలేరమ్మ జాతరకు 1500 మంది పోలీసులతో కట్టుదిట్టంగా బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కంట్రోల్‌రూం ద్వారా గట్టి నిఘా ఉంచనున్నట్లు చెప్పారు. క్రైమ్, ట్రాఫిక్, సెబ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీలు విమలకుమారి, కులశేఖర్, రాజేంద్ర, లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్పీలు సూర్యనారాయణ, రాజ్‌గోపాల్‌రెడ్డి, ఆర్డీఓ కిరణ్‌కుమార్, ఆలయ ఈఓ శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ పాల్గొన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

పోలేరమ్మతల్లి జాతర పోస్టర్‌ను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పోలేరమ్మను దర్శించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు.

భక్తిశ్రద్ధలతో రెండో చాటింపు

వెంకటగిరి జాతర సందర్భంగా బుధవారం రెండో చాటింపు వేశారు. కంపాళెంలోని గాలింగం కుల అమ్మవారు, కామక్షమ్మ ఆలయంలో వినాయకస్వామికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్టోబర్ 4,5వ తేదీల్లో అమ్మవారి జాతర జరుగుతుందంటూ తప్పెట్లు, తాళాలతో చాటింపు వేశారు. అనంతరం వరదరాజుల స్వామి ఆలయం, పాత కోట వీరాంజనేయస్వామి దేవస్థానం, పోలేరమ్మతల్లి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి రాజావీధిలోని పాత శివాలయం వరకు చాటింపు కొనసాగించారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,380
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,440
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,100
రిటైల్ వెండి గ్రాము	రూ.75.10

1 నుంచి క్రీడా పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 1 నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్–19 కేటగిరిలో జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ యూ జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 1వ తేదీన మదనపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఫుట్‌బాల్, బీటీ కళాశాల ఆవరణలో ఉదయం 9.30గంటలకు బాస్కెట్ బాల్, నెట్ బాల్, 2వ తేదీనతిరుచానూరు రోడ్డులోని ఎపీఎస్పీడీసీఎల్ టెన్నిస్ మైదానంలో టెన్నిస్, 6వ తేదీన తిరుపతిలోని ఎస్వీజేఎస్ఎం స్కూల్ ఆవరణలో బాల్‌బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్, సెపక్ తక్రా, రెజ్లింగ్, 7వ తేదీన తిరుచానూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో బాక్సింగ్ పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఇంటర్ చదువుతున్న క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, పదో తరగతి మార్కుల లిస్ట్. ఆధార్ కార్డు జిరాక్స్‌లతో హాజరవ్వాలని సూచించారు.

పర్యావరణ హితంగా పర్యాటకం



జెండా ఊపి 2కే రన్ ప్రారంభిస్తున్న మేయర్ శిరీష, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జేసీ బాలాజీ

తిరుపతి కల్చరల్: పర్యావరణ హితంగా పర్యాటక రంగం అభివృద్ధికి కృషి చేయాలని మేయర్ శిరీష, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జేసీ బాలాజీ పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని టూరిజంశాఖ ఆధ్వర్యంలో 2కే రన్ చేపట్టారు. రామానుజ సర్కిల్ వద్ద జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ టూరిజం ద్వారా అనేక మంది జీవనం సాగిస్తున్నారన్నారు. హోటల్స్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, ట్రావెల్ ఏజెన్సీలు టూరిజంపైనే ఆధారపడ్డాయని వెల్లడించారు. ఈక్రమంలో తిరుపతి సైతం పర్యాటకంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని తెలిపారు. జేసీ బాలాజీ మాట్లాడుతూ టూరిజంతో ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో టూరిస్టులు వస్తుంటారని, వారితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. పర్యాటకులకు మోడల్‌సిటీగా తిరుపతిని తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి పరిసరాల్లో సైతం వివిధ కాన్సెప్ట్‌లతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం 2కే రన్ శిల్పారామం వరకు సాగింది. కార్యక్రమంలో పర్యాటక శాఖ ఆర్‌డీ రమణప్రసాద్, జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారి రూపేంద్రనాథ్, శిల్పారామం ఏఓ ఖాదర్‌వలీ, ఎస్వీ ఇన్‌ఫ్రా గోల్డెన్ లక్సరీ విల్లాస్ ఏజెన్సీ ప్రతినిధులు డాక్టర్ రాజేష్‌రెడ్డి, సోనా తేజస్వి పాల్గొన్నారు.

బ్రహ్మాండంగా 'భాగ్ సవారీ'



ఊరేగింపుగా ఆలయానికి వేంచేస్తున్న శ్రీవారు

తిరుమల : తిరుమలలో బుధవారం బ్రహ్మాండంగా భాగ్‌సవారీ ఉత్సవం నిర్వహించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్తి అయిన మరుసటిరోజు భాగ్ సవారీ నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా స్వామివారు సాయంత్రం 4.30 గంటలకు వైభవోత్సవ మండపం నుంచి బయలుదేరి అప్రదక్షిణంగా అనంతాళ్వారు తోటకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలందుకుని తిరిగి ఆలయంలోనికి ప్రవేశించడంతో భాగ్ సవారీ ఉత్సవం ముగిసింది. అంతకుముందుపురుశైవారి తోటలో అనంతాళ్వారు వంశీకులు నాళాయరా దివ్య ప్రబంధం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, పేష్కార్ శ్రీహరి, పార్‌పతేదార్ తులసీ ప్రసాద్ పాల్గొన్నారు.

పెయింటింగ్ దుకాణంలో చోరీ

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంక్ సమీపంలో ఉన్న శ్రీమారుతి పెయింటింగ్ దుకాణంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. బుధవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన దుకాణ యజమాని భరణి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాపు కౌంటర్‌లోని రూ.3.80 లక్షలను దుండగుడు అపహరించినట్లు పేర్కొన్నారు. దుకాణం వెనక గ్రిల్స్ విరగొట్టి లోపలికి ప్రవేశించారని, అప్పుగా తెచ్చిపెట్టుకున్న నగదును ఎత్తుకెళ్లాడని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీ పరిశీలించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి చేతులకు గ్లౌజులు వేసుకున్నాడని, ముఖానికి గుడ్డ కప్పుకున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సీసీ ఫుటేజీలో దొంగ చిత్రం

ఐదుగురు ఎర్ర దొంగల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

తిరుపతి మంగళం : అన్నమయ్య జిల్లా సుండుపల్లె వద్ద బుధవారం పింఛా డ్యామ్‌కు సమీపంలో ఎర్రచందనం దుంగలను కారులో లోడ్ చేస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ జి.చెంచుబాబు తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ రిజర్వు ఇన్‌స్పెక్టర్ కె.సురేష్‌కుమార్ రెడ్డికి చెందిన ఆర్‌ఎస్‌ఐ విశ్వనాథ్ బృందం రెండు రోజులుగా కూంబింగ్ నిర్వహిస్తుండగా నిందితులు పట్టుబడినట్లు వెల్లడించారు. తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా పోలూరు తాలూకాకు చెందిన బాలు (36), సీ.కృష్ణన్ (30), వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన ప్రభు శంకరన్ (29), ప్రభు జయరామన్ (33), ఎస్. అరుళ్ (20)గా వారిని గుర్తించినట్లు వివరించారు. దుంగలతోపాటు కారు, మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.కోటి వరకు ఉండవచ్చని తెలిపారు. దాడిలో పాల్గొన్న సిబ్బందికి కర్నూల్ రేంజి డీఐజీ సెంథిల్ కుమార్ రివార్డులు ప్రకటించారని వెల్లడించారు.

ఆటో నుంచి దూకి వ్యక్తి మృతి



మణి మృతదేహం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : మండలంలోని జ్ఞానమ్మ కండ్రిగ ఎస్సీ కాలనీకి చెందిన మణి అలియాస్ సుబ్రమణ్యం (35) బుధవారం ఆటోలో నుంచి దూకడంతో మృతి చెందాడు. వివరాలు.. మణి తన భార్య సుబ్బమ్మతో కలిసి లక్ష్మీపురంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆటోలో తిరిగి వస్తుండగా భార్యాభర్తలకు వాగ్వాదం జరిగింది. దీంతో ఆవేశం పట్టలేక మణి వేగంగా వెళుతున్న ఆటోలో నుంచి బయటకు దూకేశాడు. వెంటనే శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మణి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్‌ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిల్లకూరు : స్థానిక వడ్డిపాళానికి చెందిన యనమల నారాయణమ్మ అనే మహిళ ఇంట్లో బుధవారం పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. నారాయణమ్మ తన కుమార్తెను తీసుకుని ఉదయం 8 గంటలకు శ్రీకాళహస్తి గుడికి వెళ్లింది.మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి ఇంటికి వచ్చేసరికి చోరీ జరిగినట్లు తెలిసింది. బీరువాలోని 10 సవర్ల బంగారు నగలు, రూ.5వేల నగదు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. తిరుపతి నుంచి క్లూస్ టీమ్ రప్పించి వేలిముద్రలు సేకరించారు. సీఐ ఖశరదరామారావు మాట్లాడుతూ నారాయణమ్మ బయటకు వెళ్లే సమయంలో ఇంటి తాళాలు పక్కన ఒక చోట ఉంచేదని, ఈ విషయం గమనించినవారే చోరీకి పాల్పడి ఉండొచ్చన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ అంజిరెడ్డి, కానిస్టేబుళ్లు రాజు, విష్ణు ఉన్నారు.

'సాక్షి' చిత్రానికి 'ప్రతిభ పురస్కార్'



అవార్డుకి ఎంపికైన చిత్రం (ఇన్‌సెట్) మోహనకృష్ణ కేతారి, సాక్షి ఫొటోగ్రాఫర్

ప్రపంచ టూరిజం దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన ఫొటో ఎగ్జిబిషన్లో తిరుపతి సాక్షి ఫొటోగ్రాఫర్ మోహన కృష్ణ కేతారి తీసిన తిరుమల శేషాచలం చిత్రానికి ప్రతిభ పురస్కార్ లభించింది. ఈమేరకు బుధవారం అవార్డు ప్రదానంచేశారు.
- తిరుపతి కల్చరల్

గంజాయి విక్రేతల అరెస్ట్

రేణిగుంట : స్థానిక పాంచాలినగర్ వద్ద బుధవారం గంజాయి విక్రయిస్తున్న నలుగురిని ఎస్ఈబీ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. ముందస్తు సమాచారం మేరకు సెబ్ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర, ఎస్‌ఐ భాస్కర్ తమ సిబ్బందితో తనిఖీలు చేపట్టగా ముళ్ల పొదల్లో దాక్కున్న నిందితులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.30వేల విలువైన 3కిలోల గంజాయి, ఒక మోటార్‌బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రేణిగుంట బుగ్గవీధికి చెందిన ఎస్.అబ్దుల్ సమద్ (20), ఎస్.షమీ(23), వేణుగోపాలపురానికి చెందిన కిషోర్(26), తిరుపతి కైకాల చెరువుకు చెందిన వై.శ్యామ్‌కుమార్(17)గా గుర్తించారు. రాయచోటిలో గంజాయి కొనుగోలు చేసి, రేణిగుంట, తిరుపతిలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిసింది. అబ్దుల్ సమద్‌పై గతంలో తిరుపతి రూరల్ స్టేషన్లో గంజాయి స్మగ్లింగ్ కేసు ఉన్నట్లు సెబ్ పోలీసులు వెల్లడించారు. షమీపై కూడా తిరుపతి అర్బన్ స్టేషన్‌లో కేసు ఉందని చెప్పారు.

ఈ సందర్భంగా ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర, ఇంటెలిజెన్స్ పవన్‌కుమార్, ఎస్‌ఐ భాస్కర్, సిబ్బంది రవి, చిరంజీవి, సుధాకర్, అశోక్‌కుమార్, మహేష్, సురేష్, కుమార్‌ను ఎస్పీ పరమేశ్వరరెడ్డి అభినందించారు.

రేణిగుంటలో చైన్ స్నాచింగ్



పోలీస్‌స్టేషన్ వద్ద బాధితురాలు కృష్ణవేణి

రేణిగుంట : పట్టణ నడిబొడ్డున బుధవారం పట్టపగలే ఇద్దరు యువకులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. వివరాలు.. స్థానిక పాంచాలినగర్ 2వ వీధిలో వెంకటేశ్వర్లు, కృష్ణవేణి దంపతులు నివసిస్తున్నారు. వెంకటేశ్వర్లు అరక్కోణంలో రైల్వే ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో కృష్ణవేణి స్థానిక బజారువీధికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా పల్సర్ బైక్‌పై హెల్మెట్లు ధరించి వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని మంగళసూత్రం, గొలుసు, లాకెట్ లాక్కెళ్లారు. హఠాత్పరిణామానికి నిశ్చేష్టురాలైన బాధితురాలు తేరుకుని కేకలు వేసేసరికే దుండగులు ఉడాయించారు. సుమారు రూ.3.20లక్షల విలువైన 6.5 సవర్ల బంగారు ఆభరణాలు దోపిడీకి గురైనట్లు బాధితురాలు వెల్లడించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవ్యశ్రీ కుటుంబానికి ప్రభుత్వం అండ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం) : పెనుమూరు మండల పరిధిలోని ఠాణా వేణుగోపాలపురంలో అనుమానస్పద స్థితిలో మృతి చెందిన భవ్యశ్రీ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు యశోదారెడ్డి అన్నారు. బుధవారం ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ఆదేశాల మేరకు నాయకులతో కలసి బాధిత కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవ్యశ్రీ మృతి ఘటన అందరినీ కలచి వేసిందన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ జరుగుతుండడంతో ఉప ముఖ్యమంత్రి రాలేక పోయారని, ఈ ఘటనపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీస్ ఉన్నత అధికారులకు ఆదేశిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు పూర్తి అయిన వెంటనే ఉప ముఖ్యమంత్రి నేరుగా వచ్చి బాధిత కుటుంబంతో మాట్లాడుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎద్దల మల్లికార్జున్‌రెడ్డి వారికి ఆర్థిక సాయాన్ని అందించారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పండరినాథ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు దాము, జిల్లా కార్యవర్గ సభ్యుడు దూది మోహన్, నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.